
# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023

### సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 28.369 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 3,308 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.59,050 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.5,320 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.5,480 |
| సవర (8 గ్రాములు) | రూ.43,840 |

గరిష్టం/కనిష్టం
37.0 /28.0

### వాతావరణం

సోమవారం గాలిలో తేమ 57 శాతం ఉంది. మంగళవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

# అంతా మా ఇష్టం

ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయి. విద్యార్థులకు కల్పించాల్సిన వసతులు ఏ కళాశాలలోనూ ఉండడం లేదు. దీంతో ఇంటర్ బోర్డు అధికారులు కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు అందజేశారు.

**ఇష్టారాజ్యంగా కళాశాలల నిర్వహణ, ఫీజుల వసూలు**

- అనుమతికి మించి అడ్మిషన్లు
- అనుమతి ఒకచోట నిర్వహణ మరొక చోట
- ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు
- ఉమ్మడి జిల్లాలో 73 జూనియర్ కళాశాలలకు నోటీసులు
- వివరణ పంపాలంటూ ఇంటర్‌బోర్డు ఆదేశాలు



నెల్లూరు(టౌన్): జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల నిర్వహణ యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. వారికి ఏమాత్రం ప్రభుత్వ నిబంధనలు పట్టవు. భవన సముదాయం నుంచి ఫీజుల వసూలు వరకు వారు చెప్పిందే జరుగుతున్న పరిస్థితి ఉంది. అనుమతి ఒకచోట నిర్వహణ మరొకచోట ఉన్నా ఆ శాఖ అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. కళాశాలలో ఒకరిద్దరికి వచ్చిన ర్యాంకులను ప్రచారం చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాలల భవనాలు అపార్ట్‌మెంట్‌లను తలపిస్తున్నాయి. విద్యార్థులకు అవసరమైన పూర్తి వసతులు ఏ కళాశాలలోనూ కల్పించడం లేదు. ఇటీవల కాలంలో ఆర్‌ఐఓ శ్రీనివాసులు ఉమ్మడి జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలకు సంబంధించి పత్రాలను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని 73 జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న 5 రోజుల్లో వివరణ పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

**112 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 187 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు 112 ఉండగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 75 ఉన్నాయి. వీటిలో సుమారు 60 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలల నిర్వహణ, వాటి తీరు తెన్నులపై నివేదిక పంపాలని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న ఇంటర్ జూనియర్ కళాశాలల నిర్వహణ, కళాశాలల భవనాలు, అనుమతులు, ఫీజుల వసూళ్లకు సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లపై ఆరా తీసినట్లు తెలిసింది.

**కళాశాలలకు నోటీసులు**

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని 73 ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు ఇంటర్‌బోర్డు అధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఎందుకు పాటించలేదో వివరణ పంపాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తనిఖీల్లో ప్రధానంగా కళాశాల అనుమతి ఒకచోట, నిర్వహణ మరొక చోట నిర్వహిస్తున్న పరిస్థితిని గుర్తించారు. దీంతోపాటు బాలుర కళాశాల పేరుతో అనుమతి ఉంటే బాలికల కళాశాలగా నిర్వహించడం, బాలికల కళాశాలలో బాలురు లేదా కోఎడ్యుకేషన్ నిర్వహిస్తున్న పరిస్థితిని అధికారులు గుర్తించారు. కొన్ని యజమాన్యాలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఏ కళాశాలలోనూ ఫైర్ సేఫ్టీకి సంబంధించి కిట్లు ఉండడం లేదు. కళాశాలను బట్టి విద్యార్థులను పరిమితిని నిర్ణయిస్తారు. అయితే సెక్షన్‌లో అనుమతి కన్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు తేలింది. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులతో సంబంధం లేకుండా కళాశాల, కోర్సును బట్టి ఇంటర్‌లో ఒక్కో సంవత్సరానికి రూ.20 వేల నుంచి రూ.2.50 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి కళాశాలలో ఫీజుల పట్టికను నోటీసు బోర్డులో ప్రదర్శించాల్సి ఉన్నా అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

**ఉమ్మడి జిల్లాలో..**

| | |
|---|---|
| ప్రైవేట్ జూనియర్ కళాశాలలు | 112 |
| ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు | సుమారు 60 వేల మందికి పైగా.. |
| షోకాజ్ నోటీసులు అందుకున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలు | 73 |

**ప్రభుత్వానికి నివేదిక**

జిల్లాలో ఇంటర్ జూనియర్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలల వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు జిల్లా ఇంటర్‌బోర్డు అధికారులు చెబుతున్నారు. నోటీసులు అందుకున్న కళాశాలల యాజమాన్యాల నుంచి వివరణలు వచ్చిన తరువాత ప్రభుత్వానికి నివేదిస్తామంటున్నారు. అనుమతి ఒకచోట తీసుకుని మరొకచోట కళాశాల నిర్వహిస్తే రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తారు. అలాగే సెక్షన్‌లో అనుమతి కన్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లయితే అదనంగా ఉన్న ఒక్కో విద్యార్థికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించనున్నారు. ఇలా ఒక్కో నిబంధన ఉల్లంఘనకు ఒక్కో విధంగా జరిమానా విధించనున్నట్లు చెబుతున్నారు.



తరగతి గదిలో ఇంటర్ విద్యార్థులు (ఫైల్)

**వివరణ తప్పకుండా పంపాలి**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు కళాశాల నిర్వహణకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలి. కళాశాలలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలి. నోటీసులు అందుకున్న అన్ని కళాశాలల యాజమాన్యాలు వివరణను తప్పకుండా పంపాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలల వివరాలతో ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

– శ్రీనివాసరావు, ఆర్‌ఐఓ, ఇంటర్‌బోర్డు

## న్యూస్‌రీల్

### 90.16 శాతం మందికి పింఛన్ల పంపిణీ



నెల్లూరు నక్కలగుంటలో సౌభాగ్యమ్మకు పింఛన్ అందించేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ శిరీష

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. రెండో రోజు సోమవారం 90.16 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,17,722 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందించాల్సిఉండగా, 2,86,464 మందికి పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది.

### తెలుగు ఉపాధ్యాయుడికి నంది పురస్కారం



నంది పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మున్నెళ్లి శివశంకరయ్య

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మున్నెళ్లి శివశంకరయ్య నంది అవార్డు అందుకున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలోని బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ చాంప్స్ అకాడమీ వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు సోమవారం అవార్డులు అందజేసింది. ఈ సందర్భంగా ఆయనకు నంది అవార్డుతోపాటు జాతీయ ఆదర్శ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం కూడా అందించారు. మూడు నెలల్లో వివిధ సాహితీ సంస్థల నుంచి ఐదు అవార్డులు పొందిన తెలుగు ఉపాధ్యాయుడు శివశంకరయ్యను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, గ్రామస్తులు అభినందించారు.

### మహాత్మునికి ఘన నివాళి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి సోమవారం కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గాంధీ జీవితం ఆదర్శనీయం

- ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): గాంధీ మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గాంధీజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీజీ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసే ఆయుధంగా ఆంగ్లేయులతో పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన మహనీయుడు గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి





పాలిచెర్లపాడులో పూర్తయిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఇన్‌సెట్లో) గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం: రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలిచెర్లపాడు గ్రామంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనం, సీసీరోడ్లు, సైడు కాలువలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను మంత్రి సోమవారం ప్రారంభించారు. అలాగే మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు బాటలు వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాల లబ్ధిని క్రమం తప్పకుండా అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు దక్కాలంటే టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. జగనన్న పాలనలో ఏఒక్కరి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలిచెర్లపాడు గ్రామంలో రూ.8 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయించామన్నారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**చంద్రబాబు అవినీతి వాస్తవం**

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అవినీతి వాస్తవం కాబట్టే ఆయన అరెస్ట్ సక్రమమని మంత్రి కాకాణి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్ కావడంతో ప్రభుత్వానికి సంబంధమేమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై టీడీపీ రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థను తప్పుపడుతూ జైల్లో ఉన్న చంద్రబాబు కోసం టీడీపీ దీక్షలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జయంతి రోజున బ్లాక్‌డే లాగా టీడీపీ దీక్షలు చేయడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మిత, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల అధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, నాయకుడు విజయభాస్కర్‌నాయుడు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

## గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం వైఎస్ జగన్ కృషి

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని భారతావని స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్ముడు గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి అడుగుజాడల్లో నడుద్దామని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటాలకు ఎంపీ వేమిరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలని, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలని అన్నారు. ప్రపంచమంతటా గాంధీజీ విగ్రహాలున్నాయని తెలిపారు. లాల్‌బహదూర్‌శాస్త్రి దేశ రెండో ప్రధానిగా భారతీయుల హృదయాల్లో నిలిచారన్నారు. ఆ మహనీయుల దేశభక్తి, చిత్తశుద్ధి, నిజాయతీ, సేవాభావాలు అందరికీ ఆదర్శమన్నారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిందని, సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, లీగల్‌సెల్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, హాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల్లో పరివర్తన రావాలి



ఖైదీలు తయారు చేసిన కుర్చీలు, టేబుళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

వెంకటాచలం: జైలు జీవితంతో ఖైదీల్లో పరివర్తన రావాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని చెముడుగుంట వద్దనున్న జిల్లా కేంద్ర కారాగారంలో సోమవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖైదీలు మహాత్మాగాంధీ జీవితం, ఆయన అనుసరించిన మార్గం గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. గాంధీజీని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఏదొక కారణం చేతనో, క్షణికావేశంలోనో నేరాలు చేసి జైలు జీవితం అనుభవించిన వ్యక్తులు బయటకు వచ్చిన తరువాత మార్పు రావాలన్నారు. చాలామంది ఖైదీలు జైలు జీవితం అనుభవిస్తూ, డిగ్రీ పాస్ అవడం అభినందనీయమన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలన్నారు. జైలులో అనేక వృత్తుల్లో శిక్షణ కార్యక్రమాలు, మంచి వాతావరణంలో భోజనవసతి, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయమూర్తి ఎస్.సరస్వతి మాట్లాడుతూ సత్యం, అహింస మార్గాల ద్వారా స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయులు మహాత్మాగాంధీ అని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.వాణి జిల్లా జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు మాట్లాడారు. జైలు జీవితం అనుభవిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న ఖైదీలకు డిగ్రీ సర్టిఫికెట్లు, వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం జైలు ఖైదీల శిక్షణ కేంద్రాన్ని సందర్శించి ఖైదీలు తయారు చేసిన బీరువాలు, టేబుళ్లు, కుర్చీలు, మంచాలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హిమవతి, అడిషనల్ జైలు సూపరింటెండెంట్ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎఫ్‌ఏ-2 పరీక్షలు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఫార్మేటివ్ అసెస్‌మెంట్-2(ఎఫ్‌ఏ-2) పరీక్షలు అధికారులు నిర్వహించనున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 6 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ పంపిన ప్రశ్నపత్రాలతో విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నారు.

## భక్తిశ్రద్ధలతో మాలధారణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి మాలధారణ కార్యక్రమాన్ని వేడుకగా సోమవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి, వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు మాలధారణ సామగ్రిని రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి అందజేశారు. దర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ..



కేక్ కట్ చేస్తున్న మేయర్, కమిషనర్

నెల్లూరు(బారకాసు): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సచివాలయాల కార్యదర్శులకు తినిపించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి హరీష్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సచివాలయ ఎంప్లాయీస్ అధ్యక్షుడు మట్లే బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున, కన్వీనర్ కిరణ్, మహిళా ఉపాధ్యక్షురాలు కామాక్షి, జాయింట్ సెక్రటరీ వరలక్ష్మి, సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు మేలు



మొగిలిచర్లలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించి మహిళలకు నీటిని అందజేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

**లింగసముద్రం :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి మండలంలోని మొగిలిచర్లలో వీపీఆర్ ట్రస్టు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృతధార తాగునీటి జలశుద్ధి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. తొలుత గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీపీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జిల్లాలో 110 తాగునీటి శుద్ధి కేంద్రాలను నెలకొల్పినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్నానని, తనను దీవించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మొగిలిచర్ల గ్రామం నుంచే ఆయన రాజకీయ అరంగ్రేటం ప్రారంభమైందని తెలిపారు. అనంతరం మొగిలిచర్ల శివార్లలో ఉన్న దత్తాత్రేయస్వామి మందిరంలో ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ ఆలయ విశిష్టత గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, కన్వీనర్లు పిచ్చపాటి తిరుపతిరెడ్డి, పరిటాల వీరాస్వామి, జేసీఎస్ కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డి, తహసీల్దార్ టి.ప్రసాద్, ఎంపీడీఓ శేషుబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మేకనబోయిన శ్రీనివాసులు, సర్పంచ్‌లు కొలికి లక్ష్మీనరసింహం, పులిరాఘవులు, ఎంపీటీసీ సభ్యులు దగ్గ వెంకటేశ్వర్లు, వంటేల శ్రీను, మన్నేపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో ఎన్‌ఐఏ సోదాలు

- ఏపీసీఎల్‌సీ ప్రధాన కార్యదర్శి, చైతన్య మహిళా సంఘం మాజీ సభ్యుల ఇళ్లలో సోదాలు
- కరపత్రాలు, సెల్‌ఫోన్ల స్వాధీనం

**నెల్లూరు(క్రైమ్):** మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని అమరుల బంధుమిత్రుల కమిటీ, పౌర హక్కుల సంఘం, చైతన్య మహిళా సంఘం, కులనిర్మూలన పోరాట సమితి నేతల ఇళ్లలో సోమవారం తెల్లవారుజామున ఎన్‌ఐఏ ప్రత్యేక బృందాలు సోదాలు చేపట్టాయి. అందులో భాగంగా నెల్లూరు ఏసీనగర్‌లోని పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు, ఫత్తేఖాన్‌పేటలోని చైతన్య మహిళా సంఘం మాజీ సభ్యులు అన్నపూర్ణ, అనూష(అక్కచెల్లెళ్లు) ఇళ్లలో చెన్నై, హైదరాబాద్‌లకు చెందిన ఎన్‌ఐఏ బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టాయి. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఎన్‌ఐఏ బృందాలు ఆయా ఇళ్లకు వెళ్లి తలుపులు తట్టారు. తలుపులు తీసిన వెంటనే ఇంట్లోని వారిని బయటకు కదలనివ్వకుండా ఎక్కడి వాళ్లను అక్కడే కూర్చోబెట్టి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తాము ఎన్‌ఐఏ అధికారులమని, సోదాలకు సహకరించాలని తెలిపారు. అనంతరం ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎల్లంకి వెంకటేశ్వర్లు ఇంట్లో, అన్నపూర్ణ, అనూష ఇంట్లో సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు సమాచారం. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైన సోదాలు 10 గంటలకు ముగిశాయి. సోదాలు జరుగుతున్నంత సేపు సాయుధ పోలీసులు ఆయా ఇళ్ల వద్ద మోహరించారు. ఏం జరిగిందో తెలియక స్థానికులు బెంబేలెత్తిపోయారు.


ఏసీసెంటర్‌లో వెంకటేశ్వర్లు నివాసం వద్ద పోలీసు బందోబస్తు

**వ్యతిరేకంగా నినాదాలు**

సోదాల విషయం తెలుసుకున్న పౌరహక్కుల సంఘం, భారత న్యాయవాదుల సంఘం నాయకులు అబ్బాయిరెడ్డి, బ్రహ్మం, శివకుమార్, సుబ్బారావు, రవి, కేశవులు తదితరులు ఆయా ఇళ్ల వద్దకు చేరుకుని ఎన్‌ఐఏ సోదాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే సోదాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**కుట్రకోణం**

గడచిన 25 ఏళ్లుగా తాము ప్రజాసంఘాల్లో పని చేస్తూ ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విమర్శిస్తున్నామని, మా నోర్లు మూయించాలనే కుట్రలో భాగంగా దాడులు చేస్తున్నారని ఏపీసీఎల్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు ఆరోపించారు. 2021లో విశాఖ ప్రాంతంలో ఎవరో అరెస్ట్ అయితే ఆ కేసులో తమ పేర్లు ఉన్నాయన్న నెపంతో ఇళ్లలో సోదాలు చేసి ఆ కేసుల్లో తమను ఇరికించాలన్న కుట్ర జరుగుతోందన్నారు.

**గతంలోనూ సోదాలు**

అన్నపూర్ణ, అనూష ఇంట్లో గతంలోనూ ఎన్‌ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. గతంలో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రవి అలియాస్ జైలాల్ అలియాస్ సునీల్‌కుమార్‌కు సోదరీమణులు. గతంలో వారు చైతన్య మహిళా సంఘంలో పనిచేశారు. అనంతరం నెల్లూరు శోధన్ నగర్‌లో ఉంటూ టైలరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. రవి మృతి అనంతరం రెండేళ్ల క్రితం ఎన్‌ఐఏ అధికారులు వారి ఇంట్లో సోదాలు చేసి సెల్‌ఫోన్లు, వారు రాసుకుంటున్న కవితల పుస్తకాలను తమ వెంట తీసుకెళ్లారు. దీంతో అన్నపూర్ణ, అనూష అక్కడి నుంచి ఇల్లు ఖాళీ చేసి ప్రస్తుతం ఫత్తేఖాన్‌పేటలో ఉంటున్నారు. దాడుల అనంతరం పౌరహక్కుల సంఘం, భారత న్యాయవాదుల సంఘంతో కలిసి ఎల్లంకి వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ ప్రెస్ క్లబ్‌లో ఎన్‌ఐఏ సోదాల వివరాలను వెల్లడించారు.

# రైతుల మేలు కోరిన ఏకైక సీఎం జగన్


పట్టాదారు పాసుపుస్తకాలను అందజేసున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**కొడవలూరు :** రైతుల మేలు కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని, రైతులంతా మనస్సాక్షితో ఆలోచించాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రైతులకు సోమవారం రీసర్వే పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే ప్రసన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు బాగుంటే అందరూ బాగుంటారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మారని, అందుకే వారి కోసం అనేక పథకాలను అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో 2 లక్షల 6 వేల 171 ఎకరాలను, జిల్లాలో 43 వేల 270 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. జిల్లాలో 18 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలను అందించారని తెలియజేశారు. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు.

**ప్రజల డబ్బు తిన్నందుకే బాబు అరెస్ట్**

ప్రజల సొమ్మును తిన్నట్లు సీఐడీ విచారణలో తేలినందునే చంద్రబాబును అరెస్ట్ చేశారనే విషయం ప్రజలందరికీ తెలుసునని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ద్వారా ఆయన జూబ్లీహిల్స్‌లోని ఇంట్లో డబ్బు తీసుకున్నట్లు పక్కా ఆధారాలతో అరెస్ట్ చేశారన్నారు. తండ్రి నుంచి రెండెకరాలను మాత్రమే ఆస్తిగా పొందిన చంద్రబాబుకు నాలుగు లక్షల కోట్లు ఎలా వచ్చిందో ప్రజలందరికీ తెలుసునన్నారు. ప్రజల సొమ్ము కాజేసి జైల్లో ఉన్న బాబు సత్యమేవ జయతే పేరుతో దీక్ష చేయడమేమిటని ప్రశ్నించారు. దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌కు సూట్ కేసు అందితే వారాహి ఎక్కి విమర్శలు చేయడం తప్ప ప్రజల గురించి ఆలోచించే జ్ఞానం లేదన్నారు. సీఎం కావాలని లేదంటున్న పవన్.. యువత కోసం టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నానని చెప్పడం అర్థరహితమన్నారు. సీఎం కాకుండా యువతకు ఏమి చేయగలవని పవన్‌ను ప్రశ్నించారు. కాపులంతా తన పక్షాన ఉన్నారని పవన్ కలలు కంటున్నారని, కాపు నేత రంగాను హత్య చేయించింది చంద్రబాబు అనే విషయాన్ని కాపులు మరిచిపోలేదనే విషయం దత్తపుత్రుడు గుర్తించుకోవాలన్నారు. చంద్రబాబు మరలా సీఎం అయితే లక్షల కోట్లు సంపాదించుకునేందుకే తప్ప ప్రజల కోసం కాదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు ఐ.సునీల్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరికి జాతర శోభ

- పోలేరమ్మ తల్లి జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- రాష్ట్ర పండగ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




కోలాటం ఆడుతున్న చిన్నారులు

**సైదాపురం, వెంకటగిరి రూరల్:** వెంకటగిరికి జాతర శోభ ఉట్టిపడుతోంది. గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతర రెండో రోజు సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుద్దీపకాంతులు ఆకట్టుకున్నాయి. రోజుకొక వినూత్న కార్యక్రమాలు స్థానికులను కట్టిపడేస్తున్నాయి. యువత కేరింతలు, ఈలలు మార్మోగుతున్నాయి. ప్రధానంగా కర్ణాటక డప్పు వాయిద్యాలు, కొమ్ము నృత్యాలు జాతర శోభను ప్రతిబింబిస్తున్నాయి. అలాగే కావలి కోలాట నృత్యం, తెలంగాణ నేపథ్యంలో సాగే భక్తిపాటలు సంగీత ప్రియులను హోరెత్తించాయి. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజ కుటుంబీకుడు సర్వజ్ఞ కుమారయాచేంద్ర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్, నియోజకవర్గ నేతలు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఢిల్లీబాబు, ప్రసాద్‌రెడ్డి, ఎల్.కోటేశ్వరరావు, సతీష్, కృష్ణారెడ్డి తదితరులు సహకారం అందిస్తున్నారు.

## ఖోఖో జట్టుకు కేజీబీవీ బాలికలు



**గుడ్లూరు :** మండలంలోని మొగుళ్లూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన భవ్యశ్రీ, శ్రీలక్ష్మి జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ అమృతజ్యోత్స్న, పీఈటీ చిట్టెమ్మ సోమవారం తెలిపారు. ఇటీవల జె.పంగులూరులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్–17 విభాగంలో వీరు మంచి ప్రతిభ చూపడంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు.

# గల్లంతైన విద్యార్థి మృతి

**రాపూరు :** సిద్ధిలేశ్వరకోనలోని ఆదివారం గల్లంతైన విద్యార్థి మృతి చెందినట్లు ఎస్సై మాల్యాద్రి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా, ఇస్కపల్లి గ్రామానికి చెందిన మనోజ్(21) పాండిచ్చేరిలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో మిత్రులతో కలిసి ఆదివారం సిద్ధిలేశ్వరకోనకు వెళ్లాడు. కోనలోని నీటిగుండంలో ఈతకు వెళ్లగా మనోజ్ మునిగిపోయాడు. వెంటనే అతని మిత్రులు రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, గజఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సోమవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం బయటపడింది. మనోజ్ తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మనోజ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



**పొదలకూరు నిమ్మధరలు (కిలో)**
పెద్దవి : రూ.65
సన్నవి : రూ.30
పండ్లు : రూ.7

# నలుగురు జూదరుల అరెస్ట్

**లింగసముద్రం :** మండలంలోని వెంగళాపురం గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. ఆయన సమాచారం మేరకు.. సోమవారం సాయంత్రం వెంగళాపురం పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నంచి రూ.3,450 నగదును స్వాధీనం చేసుకున్నారు.

**పేకాట స్థావరంపై దాడులు**

**కొండాపురం:** మండలంలోని నేకునాంపేట పొలాల్లో సోమవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై షేక్ ఖాజావలి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారివద్దనుంచి రూ. 1,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.మంగళవారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు వివరించారు.



# 'దాడి చేసి వేధిస్తున్నారు'

- న్యాయం చేయాలని వివాహిత వేడుకోలు

**ఆత్మకూరు :** తనపై భర్త తరపు బంధువులు దాడులకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని ఓ వివాహిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో షేక్ నస్రీన్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. వింజమూరుకు చెందిన షేక్ నస్రీన్ భర్త ముజీబ్‌తో గొడవలు రావడంతో మూడేళ్ల క్రితం విడిపోయింది. వారికి ఐదేళ్ల కుమార్తె ఉంది. ఆమె బతుకుదెరువు కోసం కలిగిరిలోని ఓ దుకాణంలో చిరుద్యోగం చేస్తోంది. రోజూ వింజమూరు నుంచి కలిగిరికి వెళ్లి వస్తుంటుంది. ఈ క్రమంలో ఆమె భర్త తరపు బంధువులు నలుగురు తమ మాట వింటే భర్తతో కాపురం నిలబెడతామని చెప్పుకొచ్చారు. అదే క్రమంలో ఆమెను తరచూ వేధిస్తుండేవారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కలిగిరిలో విధులు పూర్తి చేసుకుని వింజమూరుకు వస్తున్న ఆమెను ఆ నలుగురూ అటకాయించి ఇబ్బందులకు గురిచేశారు. ఆమె ఉంటున్న ఇల్లు (భర్త బంధువుది) వెంటనే ఖాళీ చేయాలని దౌర్జన్యానికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఆమె ఉంటున్న ఇంటిని సైతం కొంత భాగం కూలదోశారు. దీంతో అదేరోజు రాత్రి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సమయంలో రాలేమని, మరుసటి రోజు రావాలని పోలీసులు చెప్పడంతో స్టేషన్ ఎదుటే ఈ ఆదివారం తనకు న్యాయం చేయాలని ధర్నాకు దిగింది. పోలీసులు ఆమెను ధర్నాను విరమింపజేసేందుకు ప్రయత్నించే క్రమంలో చేతిలోని బ్లేడు తెగి గాయాలయ్యాయి. అస్వస్థతకు గురైన ఆమె ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. తనను వేధిస్తున్న వారిపై ఫిర్యాదు చేసేందుకు దిశ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లనున్నట్లు ఆమె తెలిపింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా పలువురిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.


తన గోడు చెప్పుకుంటున్న బాధితురాలు నస్రీన్

# మద్యం బాటిళ్ల స్వాధీనం

**ఉదయగిరి :** ఉదయగిరి సెబ్ కార్యాలయ పరిధిలోని సీతారామపురం బీసీకాలనీలో సోమవారం సెబ్ జేడీ బృందం, స్థానిక సెబ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మొత్తం 155 మద్యం సీసాలతో పాటు ఆదోని ఏడుకొండలు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా మద్యం విక్రయాలు జరపరాదన్నారు. అయితే బీసీకాలనీలో ఓ వ్యక్తి మద్యం విక్రయాలు జరుపుతున్నాడని సమాచారం అందడంతో వారి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

**వాశిలి సమీపంలో..**

**ఆత్మకూరు :** నెల్లూరు–ముంబై రహదారిపై వాశిలి సమీపంలో ఉన్న దాబాలో 8 ఫుల్ మద్యం బాటిళ్లను ఆత్మకూరు ఎస్‌ఈబీ సీఐ బి.నయనతార తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యంతో పాటు వెంకట్, సురేష్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు.


మద్యం బాటిళ్లు, నిందితుడితో సెబ్ అధికారులు

**నర్రవాడలో..**

**దుత్తలూరు :** మండలంలోని నర్రవాడలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుదుకాణంపై సోమవారం సెబ్ జేడీ బృందం ఎస్సై బాలకృష్ణ తన సిబ్బందితో దాడులు జరిపారు. మొత్తం 19 మద్యం సీసాలు, ఒక ఫుల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు షేక్. రహీం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలతో పాటు మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఉదయగిరి సెబ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.